# గృహిణీ ప గృహం

ఇసుక తిన్నెల మీదనుంచి వచ్చే ఆ చల్లటి ఏటిగాలి, పచ్చని పైరుల మీదనుంచివచ్చే ఆ వెచ్చటి పంటగాలి, ఆ భవనము రెండవ అంతస్తులో కూర్చుని ఆలోచిస్తున్న రవికి ఎంతో ఆనందాన్ని, హాయిని చేకూర్చేవి. ఆ గదిలో గంటలతరబడి కూర్చుని కాలాన్ని వెళ్ళబుచ్చుతూ వుండేవాడు. ఆ భవనం అంతా అంత సన్నిహితమైనది రవికి. బైటనుంచి చూసినా లోపలికి వెళ్ళినా, రవి తన్మయం చెందుతూ ఉండేవాడు. ఆ గదిలో జీవకళలు వుట్టిపడుతున్న చిత్రాలు చలువరాతిలో అమర్చబడి ఉన్నాయి. ఆగదినిండా చక్కగా అమర్చబడిన కుర్చీలు, డ్రాయర్లు, తివాసీలు అతిధుల్ని ఆహ్వానిస్తున్నట్లు కనపడేవి. అక్కడ డ్రాయరుమీద ఒక కృత్రిమ పూల సజ్జ, ఇంకొక గాజుపాత్రలో పొంకంగా అమర్చబడిన మల్లెమొగ్గలమధ్య గులాబి రెక్కలు చూడటానికి ఎంతో ముచ్చటగా వున్నాయి. ఆ గది గోడమీద అతి సుందరమైన ప్రకృతి చిత్రాలు ఫ్రేములలో తగిలించి వుంచబడ్డాయి.ఆ ఏటి గాలికో, ఆ పైరుగాలికో, ఆ చిత్రాలు మెల్లిమెల్లిగా వూగులాడిపోతుంటే, రవి మనస్సులో యేవేవోతియ్యటివూహలు చెలరేగుతూవుండేవి. ఆగదిగుమ్మంలో తాను ప్రవేశించినప్పుడల్లా రవికి,ఏదో కొత్తదనంగా ఆహ్వానిస్తున్నట్లు కనిపిస్తూ వుండేది. ఆ గదికి నాలుగువైపుల నాలుగు కిటికీలు వున్నాయి. ఆ కిటికీ తలుపులు కనక తెరిచామంటే, ఆ బైటగాలంతా యీ గదిలోకే వచ్చిందేమో అన్నంత జోరుగా గదిలో ప్రవేశించి దాని నిశ్శబ్దాన్ని భంగపరుస్తుంది. అందుకనే ఆ కిటికీ తలుపుల సందుల్లోంచి వచ్చే గాలికి మాత్రమే ఆ గది అవకాశము యిచ్చింది. ఈ గదిలోకి రవివచ్చి తాను యేకాంతంగా కూర్చుని, యేవేవో ఆలోచిస్తూ వ్రాసుకుంటూ కాలము యొక్క విలువను యేమాత్రం గ్రహించకుండానే ప్రొద్దు పుచ్చుతూ వుండేవాడు. ఆ గదియొక్క వాతా

వరణము అతనికి యెంతో హాయి చేకూర్చేది. ఆ గదికి ప్రక్కనే అనుకుని యింకా రెండు గదులున్నాయి' శయనించే గదిలో వక పెద్ద పందిరి పట్టి మంచం, ఆ మంచానికి యెదురుగుండా మనిషి యెత్తున వక పెద్ద అద్దం, చుట్టూను చక్కటిఫొటోలు, ఆ గదిలో ప్రవేశించినట్లయితే క్షణంలో నిద్ర వచ్చేస్తుంది. ఆ గదికి ముందుగా కొంచెం వరండా కూడా వుంది. రవికి ప్రత్యేకించబడిన గదులు యివి. రవిజీవితంలో నూతనత్వం చూడటంకంటె పరమార్థము అతని తలిదండ్రులకు యింకొకటి లేదు. రవి గృహస్థుడు కావాలని వాళ్ళ కోరిక, అతనుకోరేది అదే.

అనాడు సాయంత్రము సుజాతను ఆ గదిలోకి తీసుకు వచ్చాడు. సుజాత హృదయంలో యేదో భయము, పైకి చెప్పలేని బెదురు. తన అంతస్థుకు, యీ భవనపు అంతస్థుకువున్న మెట్లు తలుచుకుంటుంటే, సుజాత యింకా పిరికిదయి పోతోంది. ఆ గదిలో అమర్చబడ్డ కుర్చీలు, డ్రాయర్లు, ఆ ఫొటోలు అవన్నీ చూస్తుంటే సుజాత హృదయము పొంగిపోతోంది. వక్కసారిగా ఆ గది కిటికీలోంచి యిద్దరు బైటవైపుకు పొంచి చూచారు. ఏవో గంభీరమైన భావాలు, పైకి చెప్పలేని ఆనందము వాళ్ళిద్దరి మనస్సుల్లోను అప్రయత్నంగా దూరి గిలిగింతలు పెట్టేసినాయి. వంట గది అంటూ ఆ గది తాళం అప్పుడే తీశాడు. హక్కు దారురాలు వచ్చిందన్నట్లుగా, ఆ గదిలో అమర్చబడ్డ వస్తువులను తదేక దృష్టితో పరిశీలిస్తూ, సుజాత అట్లాగే నిలబడిపోయింది. సుజాత కళ్ళు అప్రయత్నంగా చెమ్మగిలినాయి. గిర్రున వెనక్కు తిరిగింది. రవి కారణము వూహించ లేక పోతున్నాడు. 'ఎంత హాయిగా ఎంత ఆనందంగా వుంది' అన్నది సుజాత పెద్ద విశ్వాసంతో. ఇంకా ఆమె కళ్ళు మెరుస్తూనే వున్నాయి. రంగు రంగుల చిత్రాలు, చిత్ర విచిత్రమైన వస్తువులు అవన్నీ ఆమె మనస్సులో, యేవేవో వూహల్ని చెలరేగిస్తున్నాయి. రవి చూపిస్తూ, చెపుతున్న విషయాలన్నింటికి సుజాత తత్తరపాటుతో తలవూపుతోంది. ఇది పడక గది అని రవి వూహకున్నాడు. రవి

సుజాత ముఖంవంక చిరునవ్వుతో చూశాడు. కాని సుజాత చిరునవ్వును స్వీకరించలేదు. పైగా ఏవో విచార ఛాయలు ఆమె ముఖంలో తాండవ మాడుతుంటే, రవి మనస్సు చివుక్కు మన్నది. 'సుజాతా! ఏమిటో నీ ఆలోచన' అని ఆమె ముఖంలో ముఖంపెట్టి అడిగాడు. 'ఏంలేదు.' అని నవ్వింది సుజాత. దాంతో మళ్ళీ రవి చొరవ చేసుకున్నాడు. సుజాత పెద్ద అనుభూతి అనుభవిస్తోంది. రవికూడ సంతోషతరంగాల్లో వోలలాడిపోయాడు. సుజాతను చూస్తున్నంతసేపు రవి వక విధమైన మనశ్శాంతి, సంతృప్తి కలిగి స్తున్నాయి. క్షణకాలం పాటు, సుజాత వంకే అతి నిశ్చలంగాచూస్తూ నిలబడి పోయాడు. వచ్చే వేళ అయింది. అని వూరుకున్నాడు రవి. సుజాత తత్తర పాటుతో గబ గబ మెట్లు దిగేసింది. సుజాత సందు మళ్ళేవరకు, రవి చూస్తూ నిలబడిపోయాడు. సుజాత మనస్సులో సంతోషము, భయము రెండు మిశ్రమమయి ఆమెను కలత పెట్టేస్తున్నాయి. తాను రవి యింటికి వెళ్ళిన విషయము తల్లితో చెప్పతూ ఏవో నవ్వుకుంటోంది. తల్లికి కూతురి సౌఖ్యం కంటె కావాలసిందేముంది? సుజాత తల్లి దృష్టి అంతే. అంత కంటె ఏమీ తెలీదు. ఇంకా ఏమీ వూహించలేదు. సంఘంలో తనకు, రవికి వున్న యినుపతెర ఆమెకు కనిపించటం లేదు. అలాంటి ఇనుపతెర లేదనుకున్న రవికే, దాని అస్తిత్వము తెలియకపోతే సుజాతకు ఏమి తెలుస్తుంది? రవి అంతస్తుకివున్న మెట్లు అన్ని వున్నాయని ఆమెకు తెలిసినా దాని విషయము అంతగా ఆలోచించ లేదు.

"అమ్మా! ఆయిల్లు ఎంత బాగుందనుకున్నావు! నువ్వుకూడ వచ్చి చూడవే" అన్నది పట్టరాని సంతోషంతో సుజాత.

'ఇప్పుడేనా. ఆ సమయము వచ్చినప్పుడు నేను వస్తానులే' అని ఊహు కుంది సుజాత తల్లి. సుజాత వులిక్కి పడింది. అమ్మ ఏవో భయము వేస్తుందే అంటూ తల్లివగ్గరకు చేరింది. సుజాతకు ఆ రాత్రంతా ఆ భవనం

విషయమే. అక్కడ వాతావరణమే కళ్ళకు కట్టినట్లు కనిపిస్తోంది. ఏదైనా కంటిమీద కునుకు పట్టిందంటె, స్వప్నంలోకూడా వీటి చింతే.

జీవితాల్లో అనుకున్నవన్నీ జరగవు. అనుకున్నవి జరిగిన తర్వాత పొందే అనుభూతి కంటె, తాను కోరిన దానికి విరుద్ధంగా జరుగుతున్న సంఘటనలను సమన్వయం చేసుకుని, అర్థం చేసుకుని, వాటిలో వుండే సుఖాన్ని పొందటానికి ప్రయత్నిస్తే, ఇంకా ఎక్కువ శాంతి, ఆనందం లభిస్తుంది. వైరుధ్యంలో వుండే ఆనందాన్ని చూసి సంతోషించే వాళ్ళు తక్కువ. అలాంటి వాళ్ళకు సుఖము, సంతోషము వకరకంగా వస్తాయి. అదీగాక సుఖదుఃఖాల విలువలు వ్యక్తుల్నిబట్టి మారుతూ వుంటాయికూడ.

రవి, సుజాతను పెల్లి చేసుకుందామనుకుంటుంటే, రవి తలిదండ్రులు ఈ సంబంధానికి ఏ మాత్రం యిష్టపడటం లేదు. కారణము కులగోత్రాలు, డబ్బు. వాళ్ళు వసంత అనే అమ్మాయిని రవికి యీడుజోడు అని నిశ్చయం చేసుకున్నారు. వసంత పెద్ద భాగ్యవంతురాలి కూతురు. తమ యెత్తుకువగ్గ హుందా వాళ్ళదీను. బి. ఎ. చదువుతోంది. అందంగా వుంటుంది. ఈడు జోడు తమ వంశ గౌరవ మర్యాదలకు అనుగుణ్యామైనది. యిక రవికి సందిగ్ధావస్థ వచ్చిపడింది. సుజాతను కాదనటానికి మనస్సు వప్పటం లేదు. కాని వసంత సంబంధం ఇంకా ఎక్కువ ఆకర్షణీగా వుంది. ఇలాంటి పరిస్థితులలో రవి వక నిర్ణయానికి రావటం కష్టమనిపిస్తోంది. వసంత అందచందాల్లో మోహము రవి గ్రహించకపోలేదు. సుజాతలో సౌజన్యం రవిని ఆకర్షించక పోలేదు. రవి సుజాతను కనక పెళ్ళి చేసుకొనకపోతే, సుజాతకు మంచి సంబంధం దొరుకుతుందని చెప్పటం సాహసమే. కాని వసంతకు అలాంటి పరిస్థితులలో తన కోరిక ప్రకారం సంబంధము దొరకవచ్చు. సుజాత దృష్టిలో ఈ సమస్యనుచూసి రవి నిర్ణయం చేసుకోవాలా? తనదృష్టితోనే ఈ సమస్యను పరిష్కరించుకోవాలా? వసంత రవికి అతిసన్నిహితం అవటం, సుజాత, తన మనస్సులోంచి దూరంగా పోవటం,జరుగుతున్నాయి.

రవికి వసంత సన్నిహితంగా వస్తుంటే వున్న ఆనందమూ ఎక్కువే, సుజాత దూరమైపోతుంటే కలుగుతున్న దుఃఖమూ ఎక్కువే. సుజాతను ఈనాడు జాలిగా, కరుణగా రవి చూస్తున్నాడంటే, రవిని నిందిస్తే, మనం యెంత వరకు రవి దృష్టిలో చూసినవాళ్ళము అవుతామో అర్థం కాదు. ఈ సమస్యలో వకే వక మాట మనకు వినిపిస్తుంది. 'ప్రేమ' ఈ మాటకు అర్థం అతి విస్తృతమైనది. దీని నిర్వచనాలు వకొక్కక్కళ్ళ జీవితాల్లో యెంతవరకు సరిపోయినాయో ప్రత్యేకంగా వ్యక్తులు చెప్పవలసిన విషయము. అయా ప్రత్యేకంగా వ్యక్తులు చెప్పవలసిన విషయము. అయా వ్యక్తులకు ఆ నిర్వచనాలు తమ తమ జీవితాల్లో సమన్వయించుకోలేకపోతే, ప్రేమ అనే మాటకు క్రొత్త క్రొత్త నిర్వచనాలు చెప్పటం అసహజంకాదు. అందువలన సుజాతను మనసారా ప్రేమించి, ఆమెను ఈనాడు అన్యాయం చేస్తాడా అని రవి వైపుకి తిరిగి అడిగే సావకాశం చాలా తక్కువ. అందువలన, సుజాతలో వసంతలో వుండే తేడాలు రవికి ఏ విధంగా అర్థమయినాయో కొంతవరకు ఆలోచించటం అవసర మనిపిస్తుంది. సుజాత సామాన్య కుటుంబంలో పుట్టి, అతి కష్టం మీద జీవనోపాధి సాధించుకుంటోంది. ఆమె చిరునవ్వుల్లో, ఆమె అమాయకపు ప్రేమల్లో, రవి యొక్క ప్రేమకు అర్థం పుట్టింది. ఆమె అతనిని యెక్కువ ఆకర్షించింది. ఆమె అమాయకపు చూపులు, అతనిని ముగ్ధుణ్ణి చేసినాయి. సుజాత నిన్ను మనసారా ప్రేమించాను. తప్పక నిన్నే పెళ్ళి చేసుకుంటాను అని అన్న మాటలు రవికి జ్ఞాపకం వస్తున్నాయి. కాని రవి సుజాతను యే దృష్టిలో ప్రేమించాడో, సుజాత, రవిని ఆ దృష్టితోనే ప్రేమించ లేదు. సుజాత తన కళ్ళ యెదుట చిరునవ్వుతో నిలబడివుంది. ఎదురుగుండా యింకొక రూపము ప్రత్యక్షమవుతోంది. వసంత రూపంలో ఆకర్షణవుంది. అందంలో సుజాతకు తీసిపోదు. ఆమె ముఖవర్చస్సుకు ఆమె కంఠంచుట్టు అలుముకు పోయిన హారాలు యింకా వన్నె తెస్తున్నాయి. వసంత కూడా రవి హృదయానికి అతి సన్నిహితమైనదే. రవిని, వసంత యే దృష్టిలో ఆకర్షించింది? ఇక ప్రేమకు అర్థం యేమిటి? వసంతను పెళ్ళి

చేసుకోవటానికి రవి నిశ్చయించుకున్నాడు. సుజాత విషయము తలుచుకున్నప్పుడల్లా వళ్ళు ఝల్లు మంటుంది రవికి. వక నిర్ణయానికి, వక అభిప్రాయానికి రావటానికి రవి ప్రయత్నిస్తున్నాడు. అలాంటి నిర్ణయము ఎదుట వారిని తృప్తిపరచలేదు సరికదా, తన మనస్సే సమాధానానికి రాలేదు. అవును సుజాతను మనసారా ప్రేమించాను. ఇప్పుడు మాత్రం దానికి విరుద్ధమేముంది? ఇప్పుడూ ప్రేమిస్తున్నాను. సుజాతను అన్యాయం చెయ్యను. ఇది నా నిశ్చితాభిప్రాయం. ఆమెకుకూడ మంచి సంబంధం దొరకాలి. గృహస్థ జీవితంలో ఆమెగూడా సుఖం పొందాలి. ఆమెకు ఈ వివాహము కాలేదనే లోపం వుండకూడదు. అట్లా చేయటం నా విధి అప్పుడు నా ప్రేమకు అర్థం సాఫల్యం అవుతుంది. ఎంత ఉదాత్తము:

"అవును నిన్ను మనసారా ప్రేమించిన మాట వాస్తవమే కాని కొన్ని పరిస్థితులు అటకంగా వచ్చినాయి, ఆ పరిస్థితుల్ని అతిక్రమించి నేను నీతో వుండగల సాహసం నాకు లేదు. కాని నీ జీవితంలో నువ్వు హాయిని అనుభవిస్తే, అదే నాకు తృప్తి, సంతోషము అదే నా ప్రేమ, యీ డబ్బు తీసుకో." అంటూ రవి తనకు సుజాతపట్ల వున్న దృష్టిని డబ్బుగా మార్చేశాడు. అతని అటంకాలు. తన తల్లిదండ్రులు ఇష్టపడక పోవటం. అసలు ముఖ్యమైనది సుజాత పట్ల, తన దృష్టిని మార్చుకొని, వసంత ఆకర్షణలో పడిపోవటం. సుజాత తల్లి ఆ డబ్బునుచూసి ఆశ్చర్యపడిపోయింది. సుజాత సంతోషానికి మేరలేదు. తన జీవితము సాఫీగా నడిచిపోవాలి అనేదే సుజాత దృష్టి. ఆ దృష్టిలో ఆమె వ్యక్తులకు ప్రాధాన్యము ఏ మాత్ర యివ్వలేదు, వసంత రవి యిద్దరు వూరేగింపులో వెళ్ళుతుంటే, సుజాత, 'అమ్మచూడు' అంటూ ఆనందంలో మునిగిపోయింది. సుజాత చూసేటప్పటికి, కారులో వున్నరవి చెప్పలేనిబాధ అనుభవించాడు, సుజాత రవినిచూసి పక్కున నవ్వేసింది.

రవి ఆమాత్రం సహాయం చెయ్యకపోతే, సుజాత యీనాడు యీ మాత్రపు యింట్లోఅన్నా వుండటానికి సావకాశము ఉండేదికాదు.

సుజాత జీవితానికి వేణు వక పెద్ద అదృష్టము. సుజాతకు చదువులేదు. వేణు సామాన్యమైన గుమాస్తా. సుజాత తన జీవితంలో వన్నెలుచిన్నెలు కల్పించుకుని, వూహల్లో విహరిస్తుంది. తనకు కూడా సంతానం కలగాలని, తాను కూడ వక కుటుంబీకురాలవాలని ఆమె కోరిక. సుజాతకు విధి రవిని భర్తగా నిర్ణయించినా యీ నాడు అనుభవిస్తున్న సుఖాన్నే అనుభవించేది. రవి, వేణుల మధ్య అనేక అగాధాలున్నాయి. ఆ అగాధాలు, ఆ మనో ప్రవృత్తులు, ఆ విశేషాలు అన్నీ లోకం దృష్టిలోనే. సుజాతకు అవేమి కను పించవు. ఇక వసంతకు తన చదువు, తన ఆస్తి, తన గృహస్థ జీవితంలోని బాధ్యతలను నిర్వర్తించటంలో అష్టం వస్తున్నాయని చెప్పాలసి వస్తోంది. ఆమెలో వుండే ధీమా ఆమెను మార్చేస్తోంది. వసంత రవినే కాకుండా యింకెవ్వరిని పెళ్లాడినా ఆమె ప్రవర్తన యిదే. వసంత మనస్తత్వానికి అను గుణంగా ప్రవర్తించటం యే భర్తకు చేతకాదు. వేణు సుజాతను యెంత ప్రేమిస్తున్నాడో, రవి వసంతను అంతగా ప్రేమిస్తున్నాడు. కాని సుజాత వేణు హృదయం తెలుసుకున్నంత, వసంత రవి హృదయం తెలుసుకోలేకపోతోంది. వసంత పట్టుదల, మంకుతనము, అర్థంలేని ఆర్భాటము, తెలివిలేని అట్టహా సము ఆమె శత్రువులు. సుజాత అణకువ, సమయస్ఫూర్తి, ఆమె కవచాలు. జీవితంలో మధువును సుజాత దంపతులు ఆస్వాదించినట్లు, రవి దంపతులు చవి చూడలేక పోవటానికి కారణము వారివారి కర్మఫలమని కొంతమంది అంటే, వారివారి మనో ప్రవృత్తులు అని కొంతమంది అంటారు.

ఆ మేడ మూలగదిలో రవి అడుగుపెట్టటం చాలా కష్టంగా వుంది. ఆ గదిలోకి వస్తున్న పిల్ల వాయువులు యీ నాడు రవి యెముకలు కొరికే చలిగాలిగా పరిణమించినాయి. రవి ఆ గదిలో యీ నాడు వంటరిగా కూర్చో లేకపోతున్నాడు. వసంత మాట తలుపుకు వచ్చినప్పుడల్లా అతనికి తీరనిబాధ కలుగుతోంది. ఆ గదిలో వున్న చిత్రాలు రవికి చాలా వికృతంగా కనిపిస్తు న్నాయి. డ్రాయురుమీద అమర్చబడ్డ పూలసజ్జల్లో గులాబిముల్లు గుచ్చుకుం

టున్నాయి. మల్లెమొగ్గలు వాడిపోతున్నాయి. తన గదిలోకి వెళ్ళి ఆ మెత్తల మీద నడుము వాలిస్తే, తన వంటినిండా తేళ్లు ప్రాకినట్లు అవుతోంది. ఎదురుగుండా వున్న అద్దంలో తన మూర్తి తనను యేదో వెక్కిరిస్తున్నట్లు కనిపిస్తోంది. ఆ సుందరమైన రంగులు తన కళ్ళను మిరుమిట్లు గొలిపిస్తున్నాయి. ఆ గది రెండు తలుపులు తెరుచుకువుంటే, తాను ఆ గదిలోకి వెళ్ళబోతున్నప్పుడు, ఏవో కాలసర్పము నోరు తెరిచి మ్రింగటానికి ప్రయత్నిస్తున్నట్లు, ఆ రెండు తలుపులు కనిపిస్తున్నాయి. వసంతకు తోచినప్పుడు, సభలకు వెళ్ళటం, రవి అస్థిత్వాన్ని ఆమె గుర్తించక పోవటం, రవి హృదయంలో తగిలిన గాయాలకు కారణాల్లో కొన్ని. ఇలాంటి మేడలు, నేను తలుచుకుంటే ఎన్నైనా కట్టిస్తా అంటూ తనను దెప్పి పొడిచిన వసంత మాటలు, రవికి శూలాలు లాగ గుచ్చుకుంటున్నాయి. రవి బాధ, రవి మనోవేదన రోజు రోజుకు హెచ్చిపోతున్నాయి. తన పడక గదిలోకి వెళ్లుతుంటే విపరీతమైన భయము, ఆవేదన కలుగుతున్నాయి. అతనికి పడక కుదరలేదు. మానవులు డబ్బుతో కొనగల వస్తువులేమి అతనిని సంతృప్తిపరచలేక పోతున్నాయి.

సుజాత దంపతులు వున్నది అద్దెకొంప. ఆ యింటికి మూడే గదులు. అవైనా బాగా చిన్నవి. ప్రస్తుతము మనకు సరిపోతుందని వేణు, సుజాతలు సమాధానానికి వచ్చారు. ఒకటి మిద్దె గది. మిగతావి రెండు పెంకుటివి. పురాతనము అవటంచేత యింట్లో అడుగుపెట్టినప్పటినుంచి ఏవో ఒకటి వంటి మీద రాలుతూ వుండటమే. సున్నం మాత్రం పట్టు బలవంతాన కొట్టించారు. మొదటి గదిలో రెండు యీతాకు చాపలు పరిచి వున్నాయి. ఒక తుంగచాప భద్రంగా చుట్టి ఒకమూల వుంచబడి వుంది. ఒక పడక కుర్చీ, ఆ గదిమూల వంకెకి తగిల్చి వుంటుంది. ఆ గదిలో వున్న సామాను యిదంతా. పడక గదిలో సామాన్యమైన మంచాలు వున్నవి. ఒక కిటికీ తెరిస్తే గాలి బాగా రాదు. దోమల బాధ కూడ వుంది. రెండు మూడు దేముళ్ళ పటాలు గోడకు వ్రేలాడుతూ వుంటాయి. ఆ గదిపైన అటకలో, యింటివారి సామానంతా

పెట్టి వుంచారు. ఆ గదిలో యీ యిద్దరు కూర్చుంటే, గది నిండుగా వుంటుంది. సుజాత యెప్పుడూ యేదో కథల పుస్తకాలు, స్త్రీలకు సంబంధించిన యితర పుస్తకాలు చదువుకుంటూ కూర్చుంటుంది, భర్త ఆఫీసునుంచి యింటికి వచ్చేదాక.

వేణు ఆఫీసునుంచి రాగానే కొంచెం ఫలహారంతో కాఫీ అందిస్తుంది. అవి స్వీకరించి వెంటనే వేణు యేవో ట్యూషన్లకు వెళతాడు. తన భర్త, ఆఫీసు సంపాదనే కాకుండా ట్యూషన్ల ద్వారా కూడా సంపాదిస్తున్నాడనేదే సుజాత గర్వం. వేణుకు అదే ధీమా. నెలలో యెంత యెక్కువ నిలవచేస్తే, అంత సంతోషము. సుజాత, వేణులు వకర్ని వదలిపెట్టి వకరు క్షణం వుండలేరు.

వకనాడు ఏవో ఆలోచిస్తూ కూర్చుంటే, సుజాతకు తనకు పెళ్లి కాక మునుపు, రవితో కూడా వెళ్లిన ఆ భవనము, ఆ గదుల సంగతి జ్ఞాపకం వచ్చింది. తాను వున్న యిల్లు, ఆ భవనము పోల్చి చూసుకుంటుంటే, సుజాతకు అదో విధంగా అనిపించింది. అట్టే ఆలోచిస్తోంది.

రవి ఏదోదిగాలపడి అగదివరండాలో చతికిలపడి ఆలోచిస్తూకూర్చుంటే, సుజాత జ్ఞాపకంవచ్చింది. ఆ కాసేపు తన హృదయభారము తగ్గినట్లు అనిపించింది. తాను అదివరలో సుజాతను యిక్కడికి తీసుకువచ్చిన ఘట్టాలు వక్కొక్కటే స్మృతిపథంలోకి వస్తున్నాయి. ఇంతవరకు రవి, సుజాతయింటికి వెళ్ళలేదు. ఈనాడు ఆమెను చూడాలనేవుద్దేశంతో చివాలునలేచి వాకిటిగుమ్మంలోకి వచ్చాడు. వాకిట్లో కారులోంచి వసంత, ఆమెతో పాటు వక స్నేహితుడు దిగి వస్తున్నారు. వసంత, రవి వంక చూసికూడా అతి నిర్లక్ష్యంగా అతనితోకూడా పై గదిలోకి వెళ్లిపోయింది. రవి హృదయభారంతో గడప దాటాడు. అనాడే రవి సరాసరి సుజాత యింటికి వెళ్లి పోయాడు. తలుపు వోర వాకిలిగా వేసి వుంది. వేణు అప్పుడే ట్యూషన్లకు వెళ్ళిపోయాడు. వోరవాకిలిగా వేసివున్న తలుపు తీసి, రవి గదిలోకి వచ్చి నిలబడ్డాడు.

'మీరా' అన్నది సుజాత తత్తరపడుతూ. సుజాత శరీరంలో యేదో విపరీతమైన భయము, వణుకు కలిగినాయి.

'నేను మిమ్మల్ని చూసిపోదామని వచ్చాను' అన్నాడు రవి అతి నిబ్బరంగా.

రవిని వెళ్ళిపొమ్మనటానికీ మనస్సు వప్పటంలేదు. పరాయి మగవాన్ని తన భర్త లేనప్పుడు ఇంట్లోకి ఆహ్వానించి కూర్చోపెట్టటం అంతకంటే యిష్టం లేదు. ఈ మధ్యలో సుజాత మనస్సు తబ్బిబ్బులయిపోతోంది. రవి యీ విషయము గ్రహించినా, తన మనోవేదన వక్కసారి సుజాతతో చెపితే, కొంత వరకైన మనశ్శాంతి లభ్యమవుతుందనే గంపెడాశతో వచ్చాడుకాబట్టి, సుజాతను తానే దైన్యంగా పలకరించాడు మళ్ళీ.

'నన్ను చూసి భయపడుతున్నావా' అన్నాడు ఎత్తిన తల వాలుస్తూ. సుజాతకు యేమి సమాధానం చెప్పాలో తోచటం లేదు. రవి వైపుకు తిరిగి చూసింది. రవి దైన్యావస్థ సుజాత హృదయాన్ని కదల్చేసింది.

'ఇట్లా వున్నారే' అన్నదిసుజాత. అనుకోకుండా వచ్చినమాట. అమాట రవి గుండెని ముక్కలుముక్కలుగా బ్రద్దలుచేసింది.

రవి పెద్ద నిట్టూర్పు విడిస్తూ, 'నా జీవితాన్ని, నా సుఖాన్ని చేతులార నాశనం చేసుకున్నాను. ఈ నాడు విచారపడితే యేం లాభము' అన్నాడు. అతి నిబ్బరంగా.

సుజాతకు చాలా ఖేదాన్ని కలిగించింది. ఇక్కడ కూర్చోండి అంటూ చిలకకొయ్యకు తగిలించిన కుర్చీ తీసి వేసింది. ఫరవాలేదంటూ ఆ చాప మీద చతికిలపడ్డాడు రవి 'అబ్బ ఎంత హాయిగా వుంది' అంటూ.

కుశల ప్రశ్నలు వేసుకుంటున్నారు. బరువైన హృదయంతో రవి సమాధానాలు చెపుతున్నాడు.

'మీ దయవలన మీ అద్దెకొంపలోనైనా సుఖంగానే వున్నాము. ఆ భవనము, ఆ గదులు తలుచుకున్నప్పుడల్లా, నా మనస్సు అదోవిధంగా వుంటుంది. అలాంటి సుఖము అందరికి రమ్మంటే వస్తుందా! ఎవరి అదృష్టము ఎలాంటిదో అన్నది సుజాత కొంచెం చనువుగానే.

రవి యేమి మాట్లాడలేదు. రవి కళ్ళల్లో నీళ్లు గిర్రున తిరిగినాయి. సుజాత వులిక్కిపడింది.

'సుఖము.... అగదుల్లోలేదు....' అ....సుఖము....అ గదుల్లోలేదు.... అంటూ బైటకువెళ్ళిపోయాడు రవి, సుజాతవంక నిశ్చలంగా రెండుక్షణాలు చూసి.

వెళ్ళిపోతున్న రవి వైపు దిగాలపడి, అతి ఆశ్చర్యంగా గుమ్మంముందరే వేణు వచ్చేదాక నిలబడిపోయింది సుజాత.

——:0:——